బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్

చేవెళ్ల రూరల్ : బీఆర్ఎస్‌వీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

చేవెళ్ల రూరల్ : సబితారెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు

మాజీ మంత్రులకు శుభాకాంక్షల వెల్లువ

వికారాబాద్, జనవరి 1 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రె సిడెంట్ కేటీఆర్‌ను బుధవారం హైదరాబాద్‌లో మాజీ బీసీ కమిషన్ సభ్యుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శుభప్రద్ పటేల్ కలిసి నూ తన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌కు శుభప్రద్ పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

చేవెళ్ల నుంచి..

చేవెళ్ల రూరల్ : మాజీ మంత్రులు, సిద్దిపేట, మహేశ్వరం ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్ రావు, సబితారెడ్డికి పలువురు నేతలు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. చేవెళ్ల మండల పరిధిలోని తల్లారం అనుబంధ గ్రామం దుద్దాగుకు చెందిన బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనపురం శశిపాల్ హరీశ్ రావును నగరంలోని ఆయన నివాసంలో బుధవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శశిపాల్ ఆధ్వర్యంలో రూపొందించిన బీఆర్ఎస్‌వీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ఆమె నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రులను కలిసిన వారిలో బీఆర్ఎస్ నవాబుపేట మండల వైస్ ప్రెసిడెంట్ శాంతి కుమార్, సీనియర్ నేత విష్ణు, బీఆర్ఎస్వీ నేతలు నందు, కార్తీక్, శ్రీనివాస్, తంగడిపల్లి మాజీ సర్పంచ్ అనూషసత్తయ్యగౌడ్ పాల్గొన్నారు.

కడ్తాల్ నుంచి..

కడ్తాల్ : మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను బుధవారం మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి ఆయనతోపాటు బీఆర్ఎస్ నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిర్మలాశ్రీశైలంగౌడ్, మాజీ జడ్పీటీసీ నర్సింహ, నాయకులు జంగయ్యగౌడ్, బుచ్చిబాబు, నరేశ్ గౌడ్, సాబేర్, నర్సింహ, మహావీర్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట నుంచి..

నవాబుపేట : నూతన సంవత్సరం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నవాబుపేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఘనపురం శాంతి కుమార్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావును మార్యాదపూర్వకంగా కలిసి శుభకాంక్షలు తెలిపారు.

కడ్తాల్: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్

సాయమడిగితే రూ.29 వేలు స్వాహా

- ఏటీఎం కార్డు మార్చి నగదు డ్రా చేసిన గుర్తు తెలియని వ్యక్తి

చేవెళ్ల రూరల్, జనవరి 1 : ఏటీఎం సెంటర్‌లో డబ్బులు డ్రా చేసి ఇవ్వమని అడిగిన పాపానికి రూ.29 వేలు స్వాహా చేశాడో గుర్తు తెలియని వ్యక్తి. చేవెళ్ల ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన కావలి బందయ్య డిసెంబర్ 30న చేవెళ్లలోని ఎస్‌బీఐ ఏటీఎంలో నగదు డ్రా చేసుకునేందుకు వెళ్లాడు. ఆయనకు మనీ డ్రా చేయడం రాకపోవడంతో అదే సమయంలో పక్కన ఉన్న గుర్తు తెలియని వ్యక్తికి రూ.1000 నగదు డ్రా చేసి ఇవ్వమని బందయ్య తన ఏటీఎంను ఇచ్చాడు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తి నగదు డ్రా చేసి డబ్బుతో పాటు వేరే ఏటీఎంను బందయ్యకు ఇచ్చి వెళ్లిపోయాడు. మరుసటి రోజు బాధితుడు బందయ్య తన ఖాతాలోని బ్యాలెన్స్‌ను చెక్ చేసుకోగా రూ.29 వేలు డ్రా అయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. దుండగుడు మొయినాబాద్‌లోని ఓ ఏటీఎంలో నగదు డ్రా చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

శిల్పారామంలో ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

కొండాపూర్, జనవరి 1 : ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో భాగంగా నృత్య దర్శకులు కళారత్న కేవీ సత్యనారాయణ శిష్య బృందం, అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని సిన్సినాటి నగరానికి చెందిన శ్రీల హ్యాంధవి, చదలవాడ శ్రీద వరాలి, లోహిత చలసాని, అక్షర, వర్ష శృతి, శివాత్మిక, జ్యోతిలు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం సంధ్య రాజు శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలతో అలరించారు.

బీసీ మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

'బీసీల మహాసభను జయప్రదం చేయండి'

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 1: కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో ఈ నెల 3న నిర్వహించనున్న బీసీల మహాసభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. విజయ్‌రావు పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు, స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఇందిరాపార్క్ ఎదుట సభను నిర్వహిస్తున్నట్లు వివరించారు. సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌రావు మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించినట్లైతే బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీ మహాసభ ద్వారా బీసీలంతా జాగృతమై కాంగ్రెస్ పార్టీపై యుద్ధం ప్రకటిస్తామని హెచ్చరించారు. సభకు రాష్ట్రవ్యాప్తంగా బీసీలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు డాక్టర్ కందుల మధు, రవికిరణ్, సతీశ్‌రెడ్డి, గుమ్మడి క్రాంతి, సాయికుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో..

బీసీ మహాసభ విజయవంతం చేయాలని వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి నాయకుడు బొడ్డుపల్లి లింగం, ఓయూజేఏసీ వ్యవస్థాపకులు మన అశోక్ యాదవ్ మాట్లాడుతూ సభను జయప్రదం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి బీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు దండెం ఆనంద్, మిర్యాల రవీందర్, శ్రావణ్‌యాదవ్, అరుణ్, క్రాంతినాయక్, నరేశ్, శివ, గోపాల్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గేదల కుంటను కాపాడండి

అధికార పార్టీ నేతలు కబ్జా చేస్తున్నారు

బాబా జగ్జీవన్ రాం యువజన సంఘం నేతలు

బడంగ్ పేట, జనవరి 1: బాలాపూర్‌లో ఉన్న చెరువులు, కుంటలను అధికార పార్టీకి చెందిన నాయకులు కబ్జా చేస్తున్నారని బాబు జగ్జీవన్ రామ్ యువజన సంఘం అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్, తిమ్మని గిరీశ్, నీరుడు శ్రీరాములు, పగడాల ఉమేశ్, ఎం సుధాకర్ ఆరోపించారు. బాలాపూర్ రెవెన్యూ పరిధిలో ఉన్న పురాతన గేదల కుంట కట్టను తొలగించి చెరువు ఆనవాళ్లు లేకుండా చుట్టు ప్రహరీ ఏర్పాటు చేశారని, చెరువును మట్టితో పూడ్చివేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ నాయకుల కబ్జాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని పేర్కొన్నారు. బాలాపూర్ రెవెన్యూ అధికారులకు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బాలాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ .74లో ఉన్న ప్రభుత్వ భూమిని అనుసరించి గేదల కుంట ఉందన్నారు. సర్వే నంబర్. 74లో ఉన్న ప్రభుత్వ భూమిని అధికారులు సర్వే చేసిన తర్వాత మూడు ఎకరాల భూమి ఉన్నదని నిర్ధారించారన్నారు. ప్రభుత్వ భూమి, చెరువులు, కుంటలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుంటే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తిన్నట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు పోయే ఆర్‌సీఐ ప్రధాన రహదారిని అనుసరించి గేదల కుంట ఉందన్నారు. రోడ్డు సైడ్ కన్పిస్తుందన్న ఉద్దేశంతో రాత్రికి రాత్రి ప్రహరీ ఏర్పాటు చేశారని, తప్పుడు పత్రాలు సృష్టించారని తెలిపారు. ప్రహరీతో పాటు గేట్లు ఏర్పాటు చేశారన్నారు. అధికార పార్టీ అండతో దర్జాగా కబ్జాలు చేస్తున్నారని వారు ఆరోపించారు. అధికారులు అధికార పార్టీ నాయకులకు భయపడి చర్యలు తీసుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గేదల కుంటను కాపాడే వరకు పోరాటం చేస్తామన్నారు.

తాగారు.. దొరికారు..

- న్యూ ఇయర్ వేడుకల వేళ..డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు
- మూడు కమిషనరేట్ల పరిధిలో చిక్కిన మందుబాబులు
- 2600 కేసులు నమోదు..గతేడాది కంటే తక్కువగానే..
- పంజాగుట్ట పీఎస్ పరిధిలో ఒకరికి 550 పాయింట్లు

సిటీబ్యూరో, జనవరి 1 (నమస్తే తెలంగాణ): చెదురు మదురు ఘటనలు మినహా ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో కొత్త సంవత్సరం వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. మద్యం దుకాణాలు, బార్ల వద్ద అర్ధరాత్రి వరకు రద్దీ కన్పించింది. విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామంటూ ట్రై పోలీస్ కమిషనర్లు ముందస్తుగానే ప్రజలకు సూచనలు చేస్తూ వచ్చారు. దీనికి తోడు బార్లు, పబ్బులు, ఈవెంట్ నిర్వాహకులు క్యాబ్‌లు, ఆటోలతో పాటు డ్రైవర్లను కూడా అందుబాటులో ఉంచారు. మరో సంస్థ కార్లు, ద్విచక్రవాహనాలను ఉచితంగా పంపిణీ చేస్తామంటూ ముందుకొచ్చింది. ఇలా మద్యం జోరుగా విక్రయాలు సాగినా ఎవరి జాగ్రత్తలు వారు తీసుకోవడంతో గత ఏడాది కంటే ఈ ఏడాది డ్రంక్ డ్రైవ్ కేసులు 359 తగ్గాయి. నగరంలో మద్యం దుకాణాలు, బార్ల వద్ద అర్ధరాత్రి వరకు భారీగా రద్దీ కనిపించింది. యువకులు రోడ్లపై అర్ధరాత్రి వాహనాలపై తిరుగుతూ కేరింతలు కొట్టారు. పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లు అడుగడుగునా ఏర్పాటు చేశారు. అబిడ్స్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ ఏర్పాటు చేస్తే అదే రూట్‌లో కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో మరో చోట ఇలా ఒకే రూట్‌లో పలు చోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. అర్ధరాత్రి తరువాత ఉదయం 2 గంటల వరకు ఈ డ్రైవ్‌లో చాలా చోట్ల కొనసాగాయి. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకే రూట్‌లో పలు చోట్ల పెట్టడంతో అర్ధరాత్రి ట్రాఫిక్ రద్దీ ఏర్పడి, సాధారణ వాహనదారులు పోలీసులే ట్రాఫిక్ జామ్ చేయడం ఏంటీ అంటూ మండిపడ్డారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఫ్లైఓవర్లు మూసేశారు. ట్రాఫిక్, లా అండ్ అర్డర్ పోలీసులు అర్ధరాత్రి బందోబస్తులు నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటల తరువాతే యువకులు రోడ్ల పైకి వచ్చి స్నేహితులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ఖాళీ రోడ్లపై కార్లు, బైక్‌లపై వేగంగా వెళ్తూ ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. ఈ నేపథ్యంలోనే 12 గంటల తరువాత పోలీసులు రోడ్లపై ఉంటూ అతి వేగాన్ని కట్టడి చేస్తూ విస్తృతంగా డీడీ చేయడంతో గత ఏడాది కంటే ఈ ఏడాది కేసులు తక్కువ నమోదయ్యాయని పోలీసులు చర్చించుకుంటున్నారు. కాగా, పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో మొత్తం 49 మందిపై కేసులు నమోదు చేశారు. వెంగల్‌రావుపార్కు వద్ద జరిగిన తనిఖీల్లో ఓ వ్యక్తికి ఏకంగా రికార్డు స్థాయిలో 550 పాయింట్లు వచ్చాయి.

ట్రై కమిషనరేట్లలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్(డీడీ) కేసులు

కమిషనరేట్	డీడీ కేసుల సంఖ్య
హైదరాబాద్	1184
సైబరాబాద్	839
రాచకొండ	619

సర్వీసింగ్ సెంటర్ ముసుగులో

కెమికల్ పారబోత

తొండుపల్లి వద్ద సర్వీసింగ్ సెంటర్ పేరుతో కెమికల్ ట్యాంకర్లను శుభ్రం చేస్తున్న నిర్వాహకులు

శంషాబాద్ రూరల్, జనవరి 1 : సర్వీసింగ్ సెంటర్ ముసుగులో కెమికల్ వ్యర్థాలను పారబోస్తుండడంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండుపల్లి రైల్వ కమన్ వద్ద హమిదుల్లానగర్ గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన శివసాయి లారీ సర్వీసింగ్ సెంటర్ ఏర్పాటు చేశాడు అయితే అక్కడికి వస్తున్న పెద్దపెద్ద కెమికల్ ట్యాంకర్లను సర్వీసింగ్ పేరుతో వాటిని శుభ్రం చేస్తూ అందులో ఉన్న కెమికల్ మురుగు కాల్వలోకి వదులుతున్నారు. దీంతో కెమికల్ దుర్వాసనతో చుట్టు పక్కల వారికి కంటిమీద కునుకులేకుండా పోతుంది. సర్వీసింగ్ సెంటర్ పేరుతో కెమికల్ వ్యర్థాలను వదులుతున్న వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కొత్త ఏడాదిలో భూముల వంతు

హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో భూముల వేలానికి సన్నాహాలు

రెండు దఫాలుగా భూముల విక్రయంతో ఆదాయం సమకూర్చుకునే ప్రణాళికలు

సిటీబ్యూరో, జనవరి 1(నమస్తే తెలంగాణ) : కొత్త ఏడాదిలో భూములను వేలం వేసేందుకు హెచ్ఎండీఏ సన్నాహాలు చేస్తోంది. నగరం చుట్టూరా ఉన్న భూములకు వేలం నిర్వహించి... నిధులు సమకూర్చుకోవాలని భావిస్తోంది. ఇక కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు అవసరమైన నిధులను కూడా భూముల వేలం ద్వారా సేకరించే ప్రణాళికలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ ఆదేశాలతో భూముల వేలం కోసం హెచ్ఎండీఏ దృష్టి సారించింది. ఈ ఏడాదిలో నగరంలో కీలకమైన హెచ్ఎండీఏ లే అవుట్లలో ప్లాట్లను విక్రయించనున్నట్లుగా సమాచారం. కోకాపేట్ భూముల ద్వారా కోట్ల రూపాయలు ఆర్జించాలని భావిస్తోంది. కోకాపేట్ లే అవుట్‌లో మిగిలిన 24 ఎకరాలతోపాటు బుద్వేల్, మేడిపల్లి, మోకీలా ప్రాంతాల్లో హెచ్ఎండీఏ డెవలప్ చేసింది. ఈ క్రమంలో ఆ ప్లాట్లను మార్కెట్లోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. క్షేత్రస్థాయిలో మార్కెట్ తిరోగమనంలో ఉందనే వాదనలను బలహీనపరిచేలా కోకాపేట్ భూముల వేలంపై హెచ్ఎండీఏ కసరత్తు చేస్తోంది. ప్రభుత్వానికి ఆదాయాన్ని తీసుకువచ్చే నియోపొలిస్ వెంచర్ ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తోంది. ఓవైపు నగరంలో రియల్ ఎస్టేట్ మార్కెట్ అభివృద్ధి చెందుతుందని, అనూహ్యంగా నిర్మాణ అనుమతులను ఇస్తున్నామని చెప్పుకోవడం వెనుక.. చతికిల పడిన మార్కెట్‌ను ప్రభావితం చేయడంలోనే భాగమనే వాదనలు ఉన్నాయి. ఈ క్రమంలో నగరంలో పలు చోట్ల ఉన్న హెచ్ఎండీఏ డెవలప్ చేసిన వెంచర్లలో భూముల వేలానికి ప్రభుత్వం సన్నాహాలు జరుగుతున్నాయి.

భూములపై గంపెడాశలు..

నిజానికి రాష్ట్రంలో భూముల వేలం కొత్తేమి కాదు. గత ప్రభుత్వం కూడా భూముల ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా వేలం నిర్వహించి.. నిధులను సమకూర్చుకుంది. కానీ వేలానికి ముందు రియల్ ఎస్టేట్ రంగానికి అనుకూలమైన నిర్ణయాలు, అందుకు అవసరమైన మౌలిక వసతులు, పరిసరాల్లో పరిశ్రమల ఏర్పాటుతో ఆయా భూములకు విపరీతమైన డిమాండ్‌ను తీసుకువచ్చింది. అదేవిధంగా కొనుగోలుదారులకు అనువైన వాతావరణం కల్పించింది. కానీ గడిచిన ఏడాది కాలంగా నగరంలో స్థిరాస్తులను కొనుగోలు చేసే పరిస్థితి లేదు. గతంలో హైదరాబాద్ శివారులో ఏర్పడిన వెంచర్లలో ఓపెన్ ప్లాట్లలను కొనేందుకు ఆసక్తి చూపే జనాలు కూడా కాంగ్రెస్ పాలనలో ఏర్పడిన ఇబ్బందులతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో విలువైన భూములకు వేలంతో అమ్మకాలు అసాధ్యమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మార్కెట్ తేరుకునేంత వరకు భూముల వేలం చేయడం లేదా.. రియల్ ఎస్టేట్ రంగానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడేందుకు ప్రభుత్వమే చొరవ తీసుకుంటే తప్పా... గాడి తప్పిన మార్కెట్ స్థిరత్వం సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా భూములను వేలంలో విక్రయించి సొమ్ము చేసుకోవాలని భావిస్తోంది.

ఖండకావ్య రచన పోటీలకు ఆహ్వానం

సిటీబ్యూరో, జనవరి 1 (నమస్తే తెలంగాణ) : అవధాన విద్యా వికాస పరిషత్తు ఆధ్వర్యంలో ఖండకావ్య రచన పోటీ 2025 నిర్వహిస్తున్నామని అవధాన విద్యా వికాస పరిషత్ మరుమాముల దత్తాత్రేయ శర్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పద్య సాహిత్యంలో ఆధునిక రూపాన్ని సంతరించుకొన్న పద్యఖండికల పోటీకి అవధాన విద్యా వికాస పరిషత్ సాదరంగా ఆహ్వానిస్తున్నట్టు ఆయన తెలిపారు. 'మానవ సంబంధాలు' అనే అంశంపై 35 నుంచి 50 పద్యాలలోపు ఒకే ఖండికగా కానీ వేర్వేరు ఖండికలుగా కానీ పద్యాలు రాయాలని సూచించారు. 40 ఏండ్ల లోపు యువతీ యువకులకు ఈ పోటీల్లో అర్హులని తెలిపారు. స్వీయ రచన హామీ పత్రంతో ఫిబ్రవరి 15 లోపున పంపించాలని కోరారు. ప్రథమ బహుమతిగా రూ.5,116, ద్వితీయ బహుమతిగా 3,116, తృతీయ బహుమతిగా 2,116, ప్రోత్సాహక బహుమతులు రూ.1,116 అందిస్తామని వివరించారు. మే నెలలో జరిగే నాలుగో అవధాన శిక్షణ శిబిరంలో విజేతలకు సత్కారం చేస్తామని పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని నేరేడుమెట్ వెస్ట్ కాకతీయ నగర్‌లోని శ్రీరామ సదనంకు పంపించాలని కోరారు. మరింత సమాచారం కోసం 9441039146 నెంబర్‌ను సంప్రదించొచ్చని పేర్కొన్నారు.

రేపటి నుంచి అండర్ -19 బ్యాడ్మింటన్ పోటీలు

నేరేడ్‌మెట్: ఆలిండియా జూనియర్ అండర్-19 ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ పోటీలు 3 నుంచి 10 వరకు జరగనున్నట్లు రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్య నిర్వాహక కార్యదర్శి కరెడ్ల శ్రీనివాస్‌రావు, ఈవెంట్స్ అండ్ ప్రోటోకాల్ బ్యాట్ యూవీ ఎన్. బాబు పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్ గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఇండియా చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ పర్యవేక్షణలో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. ఈ పోటీలకు రాష్ట్ర, అంతర్రాష్ట్రాలకు చెందిన సుమారు 1500 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని వారు తెలిపారు.

సందడిగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కొమిరిశెట్టి ఫౌండేషన్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను బుధవారం చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ కాలనీలో నిర్వహించారు. తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి తెలిసేలా ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ముగ్గుల పోటీలను విజయవంతం చేశారు. పోటీల్లో ఉత్తమంగా నిలిచిన ముగ్గులను ఎంపిక చేసి, బహుమతులను అందజేసినట్లు తెలిపారు.

– కొండాపూర్, జనవరి 1

14వరకు మహేశ్వరి అండ్ చందేరి ఫెస్టివల్

మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన మహేశ్వరి అండ్ చందేరి ఫెస్టివల్‌ను బుధవారం ఆర్ట్ గ్యాలరీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి ప్రారంభించి, ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన వస్త్రాలను పరిశీలించారు. ఈ ఫెస్టివల్ జనవరి 14 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

– కొండాపూర్, జనవరి 1

కొత్త ఏడాది తొలి రోజున కిక్కిరిసిపోయిన జూపార్కు